గండం తప్పింది.!



దుకాణాలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

- ఓల్డ్‌జైల్ ప్రాంతంలో కూలిన ప్రహరీ
- పరుగుతీసిన దుకాణాదారులు
- ఒకరికి గాయాలు.. తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న వ్యాపారస్తులు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్ డివిజన్ ఓల్డ్‌జైలు ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం ప్రహరీ నేలకూలింది. ఈ ప్రమాదంలో ఒకరి స్వల్పగాయాలకు గురయ్యారు. వర్షాలకు ఓల్డ్‌జైల్ ప్రహరీ కూలి ప్రక్కనే ఉన్న దుకాణాలపై పడింది. ఈ సంఘటనలో జీవన్ టైలర్ యజమాని కృష్ణ స్వల్పగాయాలకు గురయ్యారు. సాయంత్రం సుమారు 5గంటల ప్రాంతంలో ప్రహరీ జీవన్ టైలర్ దుకాణంపై పడింది. దీంతో ఉలిక్కి పడ్డ కృష్ణ వెంటనే బయటికి పరుగులు తీశారు. అప్పటికే పైకప్పు అతని ఎడమకాలు వేలుమీద, నడుము భాగంలో పడింది.

◆ భయంతో బయటకు వచ్చిన కృష్ణను పక్క దుకాణం దారులు బయటకు వచ్చి ఎమైయింది అని ఆరా తీస్తుండగా మిగిలిన దుకాణాల మీద గోడ పడింది. దీంతో దుకాణాదారులు ఒక్కసారిగా భయాందోళనకు గురై రోడ్డుపైకి పరుగులు తీశారు. అనంతరం భారీ ఎత్తున ప్రహరీ మిగిలిన దుకాణాలపై పడడంతో అక్కడున్న వస్తువులు, సామగ్రి ధ్వంసమయ్యాయి. దరిమిలా దుకాణదారులు ఎక్కడి వస్తువులు అక్కడే వదిలేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు తీశారని ప్రత్యక్షసాక్ష్యులు చెప్పారు. ఓల్డ్ జైల్ ప్రహరీకు ఆనుకొని సుమారు 6 దుకాణాలు ఉన్నాయి. ఎండ్ల తరబడి నుంచి స్థానిక టైలరింగ్ కుటుంబాలు ఇక్కడి దుకాణాల్లో బట్టలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎండ్ల తరబడి నుంచి తమ కార్యకలాపాలు సాగిస్తూ బతుకులీస్తున్నారు. ఈ సంఘటనలో అయిదు దుకాణాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.



ప్రమాదంలో గాయపడ్డ కృష్ణ

◆ విషయం తెలుసుకున్న వెంటనే జీహెచ్ఎంసీ బేగంపేట్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నర్సింగ్ రావు, పాండు తదితరులు అక్కడికి చేరుకొని సహాయ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. వెంటనే బూల్డోజర్‌ను తీసుకువచ్చి ప్రహరీ నెలకూలిన ఘటనలో ధ్వంసమైన దుకాణాలను తొలగించారు. ప్రహరీకు ఆనుకొని ఉన్న దుకాణాలన్నింటిని తొలగిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నర్సింగ్‌రావు చెప్పారు.

తప్పిన పెనుప్రమాదం.....

◆ మోండా మార్కెట్ ఓల్డ్‌జైల్ సమీపంలోని టైలరింగ్ దుకాణాలు సందర్శకులతో బీజీగా ఉంటుంది. ఆన్‌సీజన్ కావడంతో కొంత సందర్శకుల సంఖ్య తగ్గింది. ఇక్కడి టైలర్లు దుకాణంలోపలే పనులు చేసుకుంటూ ఉంటారు. అయితే ముందుగా జీవన్‌టైలర్ దుకాణంపై ప్రహరీ కూలడంతో సదరు యజమాని భయంతో బయటకు రావడంతో మిగిలిన దుకాణాదారులు కూడా బయటకు వచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. అందరూ కూడా దుకాణాల్లో ఉంటే ఎంతో మంది ప్రాణాలు గాలిలో కలిసిపాయేవని పలువురు స్థానికులు వాపోయారు.

◆ దుకాణాల చివరన ఓ పువ్వుల దుకాణం కూడా ఉంది. అందులో నిత్యం సుమారు 3 నుంచి నలుగురు పనులు చేసుకుంటూ ఉంటారు. అయితే మంగళవారం కావడంతో పువ్వుల దుకాణానికి యువకులు రాలేదు. దీంతో పరిస్థితి దారుణంగా ఉండేదని టైలరింగ్ దుకాణాదారులు మీడియాలో వాపోయారు. ఏది ఎమైనా ఒకరి వల్ల తామందరం బతికి బయట పడ్డామని విలేకరులతో ముందు కన్నీటి పర్యంతమయ్యారు. సంఘటన స్థలాన్ని చూడటానికి వచ్చిన స్థానికులతో మోండా మార్కెట్ ఓల్డ్ జైల్ రోడ్డు సందడిగా మారింది. మోండా మార్కెట్ లా అండ్ ఆర్డర్, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ తదితరులు అక్కడికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దడం కనిపించింది. ఈ రోడ్డులో ట్రాఫిక్‌ను మళ్లించి కూల్చివేతలను ముమ్మరం చేశారు.

బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్
- వ్యక్తిగతంగా రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: మోండా మార్కెట్ ఓల్డ్ జైలు ప్రహరీ కూలిన ఘటన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం రాత్రి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. ఇలా జరగడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుంచి టైలరింగ్ వృత్తిని నమ్ముకొని 20 పేద కుటుంబాలు సంఘటనలో తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి తన వ్యక్తిగతంగా రూ.20వేలు ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. దుకాణాలు కూలి పోయినందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి బాధితులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నర్సింగ్‌రావుతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

అమీర్‌పేట: అమీర్‌పేట శ్రీ హనుమాన్ దేవాలయ హుండీలను అధికారులు లెక్కించారు. ఆలయంలోని 10 హుండీలను మంగళవారం లెక్కించగా రూ.4 లక్షల 18 వేల 813 రూపాయల ఆదాయం వచ్చిందని కార్యనిర్వాహణ అధికారి పి.శ్రీదేవి తెలిపారు.87 రోజుల వ్యవధి కలిగిన హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవాదయ శాఖ అధికారులతో పాటు భక్తులు పాల్గొన్నారని చెప్పారు.

ఓయూలో ఎన్ఎస్ఎస్ డే

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో 56వ ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం వివిధ కాలేజీలకు చెందిన వలంటీర్లు వర్సిటీలో ర్యాలీ చేపట్టారు. యూనివర్సిటీ పరిసరాల చుట్టు చెత్తను ఏరివేసి పరిసరాలను పరిశుభ్రతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఓయూ కోఆర్డినేటర్ ప్రొ.నవీన్‌తో పాటు పీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెంటనే సీవరేజీ పైపులైన్ల పనులు చేపట్టండి



వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ పరిధిలో చేపట్టాల్సిన నూతన సీవరేజ్ పైప్‌లైన్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి మంగళవారం వాటర్‌వర్క్స్ జీఎం వినోద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏఏ ప్రాంతాల్లో పనులు చేపట్టాలో వివరాలతో కూడిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ముఖ్యంగా ప్యారడైజ్ ఫైర్ స్టేషన్ మెయిన్‌రోడ్డు, జమ్‌జమ్ బేకరీ లైన్, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, బ్రాహ్మణవాడీ లేన్‌నెంబర్ 1, 2, మయూరిమార్గ్ మెయిన్‌రోడ్డులో సీవరేజ్ లైన్‌తో పాటు కొత్త మ్యాన్‌హోల్ మూతల ఏర్పాటు, శ్యాంలాల్ బిల్డింగ్, చీకోటి గార్డెన్స్, ప్రకాష్‌నగర్, ఓల్డ్ పాటిగడ్డ ప్రాంతాల్లో వెంటనే సీవరేజీ లైన్ల నిర్మాణ పనులను చేపట్టాల్సిందిగా ఆమె కోరారు. అలాగే ఆయా పనులకు సంబంధించి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సైతం ఫోన్ ద్వారా వాటర్ వర్క్స్ జీఎం అశోక్‌రెడ్డిని కోరారు.

లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలి



సంచాలన్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న లోకో రన్నింగ్ స్టాఫ్

అడ్డగుట్ట: లోకో రన్నింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు పీ. శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ.. రైల్వే ఆస్తుల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యూపీఎస్ పెన్షన్‌ను తొలగించి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. రన్నింగ్ స్టాఫ్ క్యాటగిరీలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అదే విధంగా పని సమయాన్ని 8 గంటలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు మూర్తి, రామరాజు, కే.వి. శ్రీను, రెడ్డి, అనీష్‌కుమార్, గోవింద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం



శ్రీనివాసనగర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి పర్యటిస్తున్న అధికారులు

చిలకలగూడ: అంతర్గత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్ తెలిపారు. సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని ఐమాతా ఆలయం, నవరాల బస్తీ తదితర ప్రాంతాల్లో జలమండలి సెక్షన్ మేనేజర్ ప్రియాంకతో కలిసి మంగళవారం పర్యటించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.31.50 లక్షలు మంజూరు అయ్యావని, మేఘాలయ రాష్ట్రంలో స్టడీటూర్‌లో ఉన్న కార్పొరేటర్ సామల హేమ తిరిగి వచ్చిన వెంటనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని వివరించారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, శైలేందర్, అశోక్, మహాత్మచారి, సాపరాజు, శ్రీనివాస్, స్థానిక నాయకురాలు సృజన పాల్గొన్నారు.

గొర్లకాపరుల సమస్యలను పరిష్కరించాలని వినతి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్ల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలోని గొర్ల కాపరులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. గొర్ల కాపరులకు మినీ డెయిరీలు ఏర్పాటు చేసుకోవడం కోసం 75 శాతం సబ్సిడితో రుణాలు అందించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 శాతం జనాభా కల్గిన గొల్ల కురుమలకు రాజీయాల్లో ప్రాధాన్యం కల్పించాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు పశు సంవర్ధక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు డా. కొమ్ము అశోక్‌యాదవ్, మహేశ్‌యాదవ్, రవి, రమేష్, మధు, ప్రకాష్ తదితరులున్నారు.

నిమిషాల వ్యవధిలో ద్విచక్ర వాహనం మాయం

రాంగోపాల్‌పేట్: ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని మెడికల్ షాపు ముందు నిలిపి ఉంచి మందులు కొనుగోలు చేసి వచ్చే సరికి ద్విచక్ర వాహనం మాయమైంది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శివాజీనగర్‌కు చెందిన జే శ్రీనివాస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఈ నెల 13వ తేదీ రాత్రి 9.14 నిమిషాలకు మందులు కొనుగోలు చేసేందుకు మార్కెట్ స్ట్రీట్‌లోని సౌమ్య మెడికల్ షాపుకు వచ్చాడు. అయన తన యాక్టివా వాహనాన్ని (టీఎస్ 10 ఈసీ 9542) మెడికల్ షాపు ముందు నిలిపి మందులు తీసుకునేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చిన నిమిషాల వ్యవధిలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆయన ద్విచక్ర వాహనాన్ని దొంగిలించుకుని వెళ్లాడు. అయితే దొంగ చేతికే తాళం చెవి ఇచ్చినట్లు వాహన యజమాని నిర్లక్ష్యంగా వాహనానికే తాళం చెవి పెట్టి మందులు కొనుగోలు చేసేందుకు రావడంతో దొంగ దర్జాగా వాహనాన్ని స్టార్ట్ చేసికుని వెళ్లి పోయాడు. అటు తర్వాత వాహన యజమాని అన్ని చోట్ల గాలించి ఎక్కడ దొరకకపోవడంతో ఈ నెల 21వ తేదీన మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసికున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

వ్యక్తి అదృశ్యం



నాగేష్

అడ్డగుట్ట: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం... నార్త్‌లాలాగూడలోని శాంతి నగర్ ప్రాంతానికి చెందిన గోర్నకొండ నాగేష(42) వృత్తిరీత్యా ప్రైవేటు ఉద్యోగి. అయితే, ఈ నెల 9న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన నాగేష్ తిరిగి ఇంటికి రాలేదు. ఇది వరకు కూడా ఇలాగే వెళ్లిన నాగేష్ రెండు మూడు రోజుల్లో తిరిగొచ్చేవాడు. రోజులు గడుస్తున్నా నాగేష్ ఇంటికి తిరిగిరాకపోవడంతో అతని కుటుంబసభ్యులు తమకు తెలిసిన వారిని, బంధువులను వాకబు చేశారు. ఫలితం కనిపించకపోవడంతో సోమవారం రాత్రి లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా వ్యవస్థతో నేరాలకు చెక్

ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ



వెస్ట్ జోన్ డీసీపీకి కెమెరాలు అందజేసిన ఫార్మా నిర్వాహకులు

అమీర్‌పేట: నేరాల నివారణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకంగా మారాయని ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ అన్నారు. ఆజంట్ ఫార్మా డ్రగ్ రీసర్చ్ సొల్యూషన్స్ నిర్వాహకులు రూ.10 లక్షలు విలువచేసే సీసీ కెమెరాలను ఏసీపీ ఆధ్వర్యంలో మంగళవారం వెస్టుజోన్ డీసీపీ విజయ్‌కుమార్ కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఆర్‌నగర్ డివిజన్ పరిధిలోని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ శ్రీనివాస్ వర్మ రుద్రరాజు,ఆయన కూతురు డైరెక్టర్ సౌమ్య రుద్రరాజు పాల్గొన్నారు.

సేవ చేయండి కానీ ఆరోగ్యం జాగ్రత్త.!



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు

సనత్‌నగర్: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణతో పాటు మీ ఆరోగ్య పరిరక్షణ పట్ల కూడా జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సీనియర్ సిటిజన్స్‌ను కోరారు. ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ప్రతినిధులు మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

– అదే విధంగా వచ్చే నెల4వ తేదీన తమ కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించే సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరుకావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలతో సత్కరించారు. మొదటి నుంచి తాము నిర్వహించే అనేక కార్యక్రమాలకు అన్ని రకాల కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు మాణిక్‌రావు పాటిల్, ప్రధాన కార్యదర్శి మాణక్‌రావు, కార్యదర్శి యాదగిరి, మాజీ అధ్యక్షుడు పార్థసారధి, ఆర్‌సీకుమార్, కృష్ణదేవ్ గౌడ్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



సమావేశానికి హాజరైన బీర్ల ఐలయ్యను సత్కరిస్తున్న బీసీ ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఎప్పటికీ అండగా ఉంటుందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని లోటస్ గ్రాండ్ హోటల్లో బీసీ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడ్లడుతూ.. బీసీలకు రావాల్సిన హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలు పొందుతున్న హక్కులతో సమానంగా బీసీలకు కూడా వర్తింపజేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలోకి తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యోగులతో పాటు ఇతర శాఖల్లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులందరికి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు బీసీలకు అందాల్సిన ప్రతి ఫలాన్ని అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మబీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నిరంజన్, ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, ఆర్టీసీ బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తిరుపతయ్య, ముఖ్య సలహాదారులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉచితంగా కంటి పరీక్షలు



సాక్షి, సిటీబ్యూరో: రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ఆధ్వర్యంలో పుష్పగిరి విట్రియో రెటీనా ఇన్‌స్టిట్యూట్–సికింద్రాబాద్ సహకారంతో సికింద్రాబాద్ చిలకలగూడలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు, సిబ్బంది, తల్లిదండ్రులకు కంటి తనిఖీలను నిర్వహించారు. అందులో భాగంగా సుమారు 82 మంది వ్యక్తులు స్క్రీనింగ్‌లను నిర్వహించారు. దృష్టి సమస్యలు ఉన్నట్లు నిర్ధారణ అయిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సౌజన్యంతో ఉచితంగా అద్దాలు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

దృష్టి లోపాన్ని ముందే గుర్తిస్తే నివారణ సులభం

చిలకలగూడ: ప్రాథమిక స్థాయిలోనే దృష్టి లోపాలను గుర్తించి తగిన వైద్య సేవలు అందిస్తే నివారణ సులభమని నేత్రవైద్య నిపుణులు సూచించారు. జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్, పుష్పగిరి నేత్రాలయం సంయుక్త ఆధ్వర్యంలో మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తోపాటు చిన్నతనం నుంచే సెల్‌ఫోన్, టీవీలను ఎక్కువగా చూడడంతో దృష్టి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సుమారు వంద మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. దృష్టి సమస్యలు ఉన్న విద్యార్థులకు మరిన్ని వైద్యపరీక్షలు నిర్వహించి కళ్లద్దాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ ప్రతినిధులు లక్ష్మీ, సతీష్‌రెడ్డి, పుష్పగిరి నేత్రాలయ వైద్యులు చందు, యశ్వంత్, పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యాయులు జకియా సుల్తానా, మల్లీశ్వరీ, హసినాబేగం, నాగశృతి తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత

ఘనంగా ఎన్ఎస్ఎస్ డే వేడుకలు

సనత్‌నగర్: నేషనల్ సర్వీసు స్కీమ్ (ఎన్ఎస్ఎస్) డే వేడుకలను బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాలను తెలుసుకుని అతిథులు అభినందించారు. దేశానికి సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆ విషయంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ చైర్‌పర్సన్ పద్మావతితో పాటు ఎన్ఎస్ఎస్ యూనిట్ల అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లైబ్రరీ క్లీనింగ్.. ఇంజినీరింగ్ స్టూడెంట్స్

సనత్‌నగర్: ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకుని జేబీఐటీ ఇంజినీరింగ్, గురునాక్ ఇంజినీరింగ్ కళాశాలల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మంగళవారం గ్రంథాలయాన్ని శుభ్రం చేశారు. ప్రతినిత్యం అక్కడకు వచ్చే విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించే హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ సంజీవరెడ్డినగర్ శాఖలో దుమ్ముకొట్టుకుపోయిన టేబుళ్లు, కుర్చీలతో పాటు భవనానికి పేరుకుపోయిన బూజును దులిపారు. పుస్తకాలకు అంటిన దుమ్మును దులిపి శుభ్రం చేశారు. అలాగే లైబ్రరీ ప్రాంగణంలో ఎలాంటి చెత్తా చెదారం లేకుండా క్లీన్ చేశారు. లైబ్రేరియన్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ డే వేడుకల్లో బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు



లాలాపేటలో



తార్నాకలో భారీ వర్షం

లాలాపేట: తార్నాక, లాలాపేట ప్రాంతాంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. జనజీవనానికి తీవ్ర ఆంతరాయం ఏర్పడింది. కాలనీలు, బస్తీల రోడ్లపై వర్షం నీరు వరదలా పారింది. తార్నాక నాగార్జున నగర్ కాలనీలో ఇటీవల ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి చెరువును తలిపిస్తుంది. దీంతో స్థానికులు ఓపెన్ జిమ్ సేవలను ఉపయోగించుకోలేకపోయారు. ఈ సందర్భంగా తార్నాక వాసులు మాట్లాడుతూ... లక్షల రూపాయలు వెచ్చించి చెరువులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం ఆవరణలో పెద్ద ఎత్తున వర్షం నీరు నిలిచి స్టేడియం అంతా బురదగా మారింది. వర్షం నీరు సాఫీగా వెళ్లడానికి ఏలాంటి చర్యలు తీసుకోలేదని అధికారులను మార్నింగ్ వాకర్స్, క్రీడాకారులు, ప్రజలు విమర్శిస్తున్నారు.



తార్నాకలో ఓపెన్ జిమ్‌లో..